సాక్షి ప్రకాశం

ఆదివారం । 4 । మే । 2025



పింఛన్లకూ బ్రేకులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా కొత్తగా ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయలేదు. జిల్లాలో వేలాది మంది పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. - IIలో..



తల్లిదండ్రుల చెంతకు చిన్నారి

సింగరాయకొండకు చెందిన ఐశ్వర్య (3) అనే చిన్నారి గత నెల 30వ తేదీ నుంచి కనిపించడం లేదు. పోలీసులు ఆ చిన్నారి ఆచూకీ కనిపెట్టి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. - IIలో..

గరిష్టం/కనిష్టం 39 /25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల నియామకం

దర్శి (కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో జిల్లాకు చెందిన వారిని పలువురిని నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి శనివారం తెలిపారు. ఆమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసిందన్నారు. రాష్ట్ర స్టూడెంట్ వింగ్ జోనల్ ప్రెసిడెంట్‌గా దర్శికి చెందిన దుగ్గిరెడ్డి నారాయణ రెడ్డి, రాష్ట్ర అంగన్‌వాడీ వింగ్ ప్రధాన కార్యదర్శిగా కనిగిరికి చెందిన తమ్మినేని సుజాత, కార్యదర్శిగా దర్శికి చెందిన కందిమళ్ల గీతాంజలి, రాష్ట్ర ఎంప్లాయీస్, పెన్షనర్ల వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా సంతనూతలపాడుకు చెందిన డాక్టర్ నెట్టా సంజీవరావు, కార్యదర్శి గా మార్కాపురానికి చెందిన గోనావత్ ధర్మా నాయక్, సంయుక్త కార్యదర్శిగా ఒంగోలుకు చెందిన యనమదల స్వరూప్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు.

నేడు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో పట్టాభిరామ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ, ఐదవ బహుమతుల కింద రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేస్తారన్నారు. పూర్తి వివరాలకు 7702292595 నంబరుకు సంప్రదించాలన్నారు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి ఉండాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ఇళ్ల నిర్మాణాల పురోగతిలో ప్రతివారం స్పష్టమైన పురోగతి ఉండాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. గృహ నిర్మాణాలపై ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో శనివారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని నియోజకవర్గాల్లో కేటగిరీల వారీగా పురోగతిపై ఆమె ఆరా తీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీవీటీజీ చెంచులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం చేస్తున్నందున ఆ డబ్బులను ఇళ్ల నిర్మాణాలకి లబ్ధిదారులు ఖర్చు పెట్టేలా చూడాలని ఆమె ఆదేశించారు. ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు సమన్వయంతో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఇకపై మండలాల వారీగా కాకుండా వచ్చే సమావేశం నుంచి గ్రామాల వారీగా ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తానని చెప్పారు. ఈ దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఈఈలు, డీఈలు, ఏఈలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ఉపాధి హామీ పనుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించబోనని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఎంపీడీఓలు, ఏపీఓలు వీటికి సంయుక్తంగా జవాబుదారీ అని చెప్పారు. ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో శనివారం ఆమె ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యం మేరకు పనులు జరగకపోతే ఇద్దరిపైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ పథకం కింద జిల్లాలో నిర్వహిస్తున్న పనులు, వాటి పురోగతిని డ్వామా పీడీ వివరించారు. ఫారం పాండ్స్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు మే నెలను ఫారం పాండ్స్ మాసంగా ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. దీనిపై కలెక్టరు మాట్లాడుతూ ఈ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పశ్చిమ ప్రాంతంలో, ముఖ్యంగా యర్రగొండపాలెం నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. నీటి తొట్టెల నిర్మాణాలను కూడా సత్వరమే పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. వాస్తవ గడువు గత నెలలోనే ముగిసినా ఇంకా వీటిని పూర్తి చేయకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదో ఒక సమాధానం చెప్పి మ్యానేజ్ చేసుకుందాములే అనుకుంటే ఊరుకోనని కలెక్టర్ హెచ్చరించారు. ఉపాధి కోరిన అందరికీ పని కల్పించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ పనుల గుర్తింపునకు సంబంధించిన అనుమతులు ముందుగానే తీసుకోవాలని చెప్పారు.

కూటమి నేతలు.. మహా మేతగాళ్లు

నదీగర్భాలను ఇసుకాసురులు కుళ్లబొడిచేస్తున్నారు. అధికార పార్టీ నేతలు, అక్రమార్కులు ఒక్కటై కొండపి నియోజకవర్గంలో పాలేరు, మన్నేరు, అట్లేరు నదులపై రాబందుల్లా వాలిపోయారు. భారీ యంత్రాలతో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేస్తూ విధ్వంసాన్ని సృష్టిస్తున్నారు. అధికారం చేతిలో ఉందికదా అడిగేవాళ్లెవరు అంటూ రెచ్చిపోయారు. నిబంధనలు అతిక్రమించి నిత్యం వేలాది ట్రాక్టర్లలో వేల టన్నుల ఇసుకను దోచేశారు. దాదాపు రూ.100 కోట్లకుపైగా సహజ సంపదను కొల్లగొట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార తెలుగుదేశం పార్టీ ముఖ్యనేతల కనుసన్నల్లో జరుగుతున్న దోపిడీపై అధికారులు కిమ్మనడంలేదు.

- సుమారు రూ.100 కోట్ల విలువైన ఇసుక మింగేశారు
- కొండపి నియోజకవర్గంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా
- పాలేరు, మన్నేరు, అట్లేరు నదుల నుంచి ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- టీడీపీ అధినాయకుని కనుసన్నల్లో అక్రమ రవాణా
- 24 గంటలు ఇసుక తరలిపోతున్నా చోద్యం చూస్తున్న అధికారులు
- నియోజకవర్గంలో అడుగంటుతున్న భూగర్భ జలాలు



జరుగుమల్లి మండలం కెబిట్రగుంట ప్రాంతంలో ఇష్టారాజ్యంగా తవ్వేసిన ఇసుక

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన క్షణం నుంచే ఇసుక దందాకు తెరతీశారు. కౌంటింగ్ పూర్తయిన క్షణం నుంచే పచ్చనేతలు రెచ్చిపోయారు. జిల్లాలో ఎక్కువ నదీ పరీవాహక ప్రాంతమున్న ఈ నియోజకవర్గంలోని సహజ వనరులపై కన్నేశారు. మొదట్లో జరుగుమల్లి మండలం సతుకుపాడు వద్ద ప్రభుత్వం ఇసుక స్టాకు పాయింట్ ఏర్పాటు చేసింది. ఇక్కడ టన్ను రూ. 275 చొప్పున ప్రభుత్వం నిర్ణయించింది. నిబంధనల ప్రకారం ట్రాక్టరు ఇసుకకు రూ.1500 చెల్లించి బయట మార్కెట్‌లో రూ. 5000 లకు విక్రయిస్తూ దోపిడీని షురూ చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ సమయంలో రాత్రి పూట అక్రమంగా టిప్పర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నప్పటికీ అధికారులు ఎవరూ మామూళ్ల మత్తులో అడ్డగించలేకపోయారన్న ప్రచారం జరిగింది. అడపాదడపా అధికారులు అడ్డగించినా వారికి పనిచేసుకుంటావా లేక బదిలీ చేయాలా అన్న బెదిరింపులకు దిగారు అధికార పార్టీ నేతలు.

నిబంధనలు మీరి...

తమ పరిధిలోని నదీ పరివాహక ప్రాంతాల్లో ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుక రవాణా చేసుకోవచ్చని ఎవరూ ఆపవద్దని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చని ఆశపడిన ప్రజలకు నిరాశే మిగిలింది. ఇసుక కోసం వాహనం తీసుకుని నది వద్దకు వెళితే పచ్చనేతలు ట్రాక్టరుకు లోడింగ్ చేసిన దానికి రూ.300, తమ వాటా రూ.500 మొత్తం రూ.800 చెల్లించి మరీ ఇసుక తీసుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అదేమని అడిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి ట్రాక్టరును సీజ్ చేయించిన సందర్భాలు ఉన్నాయి. అంతేకాక నదుల్లో మనుషులతోనే ఇసుకను ట్రాక్టరుకు లోడ్ చేయాలి తప్ప యంత్రాలను వాడకూడదన్న నిబంధనను కూడా టీడీపీ నేతలు గాలికి వదిలేశారు. యథేచ్ఛగా యంత్రాల ద్వారా ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్ చేస్తున్నారు. నదీపరివాహక ప్రాంతం నుంచి ఇంటి అవసరాలకు వాడుకోవాలే తప్ప వ్యాపారం చేయకూడదన్న నిబంధన కూడా ఉంది. కానీ దానిని ఒక్కరోజు కూడా అమలు కాలేదు. ప్రతి రోజు జరుగుమల్లి నుంచి 30 కిలోమీటర్లు ఉన్న ఒంగోలుకు రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. ఒంగోలు పరిధిలో ఇసుక స్టాకు పాయింట్‌లు ఉన్నప్పటికీ జరుగుమల్లి నుంచే ఇసుక అక్రమ రవాణా జరగటంతో అధికార పార్టీలో రెండు వర్గాల మధ్య వివాదాలు తలెత్తాయిఇటీవల ఒంగోలు, కొండపి లోని పచ్చపార్టీకి చెందిన అధినాయకుల అండదండలతో ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య గొడవలు జరిగిన సంగతి విదితమే.

అధికార పార్టీ నేతలు అనుమతులు ఇవ్వాలి..

జరుగుమల్లి మండలం కామేపల్లి, సతుకుపాడు ప్రాంతంలో టీడీపీ నాయకుల ట్రాక్టర్లకే ఇసుక లోడింగ్ జరుగుతుంతోందని, ఇతరులు వెళితే టీడీపీ నేతల అనుమతి తప్పనిసరి తెలుస్తోంది. దీంతో కాలువలు, నదుల్లో ఇసుకను ఉచితంగా ఏవిధంగా తీసుకుని వెళ్లాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. అంతేకాక ఇష్టారాజ్యంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతుండటంతో ఆయా ప్రాంతాల్లో పొలాలకు వెళ్లే రోడ్లన్నీ ధ్వంసమై ద్విచక్ర వాహనాలపై పొలాలకు వెళ్లలేకపోతున్నామని దీంతో కిలోమీటర్ల దూరం నడిచి పోవాల్సి వస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఆయా మండలాల పరిధిలో భూగర్భ జలాలు అడుగంటాయని, రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

ఈ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో రాత్రి పూట టిప్పర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరగగా, ప్రస్తుతం 24 గంటలూ ట్రాక్టర్ల ద్వారా దందా జోరుగా సాగుతోందని ప్రచారం. ప్రస్తుతం జరుగుమల్లి నుంచి ఒంగోలుకు ప్రతిరోజు సుమారు 300 వరకు, కామేపల్లి నుంచి కొండపి, ఇతర ప్రాంతాలకు సుమారు 300, పొన్నలూరు మండలం వేంపాడు, ఉప్పలదిన్నెప్రాంతాల నుంచి సుమారు 300, సింగరాయకొండ మండలం మన్నేరు, కొండపి మండలం అట్లేరు నుంచి సుమారు 100 కు పైగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని తెలుస్తోంది. ప్రస్తుతం విక్రయిస్తున్న ధరల ఆధారంగా ఇప్పటి వరకూ నియోజకవర్గంలో దాదాపు రూ.100 కోట్లకు పైగా ఇసుక దందా సాగించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మంత్రి ఇలాఖాలో ఇసుక దోపిడీ



సాక్షాత్తు మంత్రి స్వామి నియోజకవర్గంలోని జరుగుమల్లి, పొన్నలూరు, కొండపి, సింగరాయకొండ మండలాల్లో ఇసుక దందా జోరుగా జరుగుతోంది. నదీ పరివాహక ప్రాంతంలో స్థానికులు ఉచితంగా ఇసుక తీసుకెళ్ల వచ్చని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అది అమలు కావడంలేదు. తెలుగుదేశం పార్టీ నేతలు ట్రాక్టర్లకు అక్రమంగా ఇసుకను లోడ్ చేస్తూ భారీగా వసూలు చేస్తున్నారు. 10 కిలోమీటర్ల వరకే ఇసుకను ఉచితంగా తీసుకెళ్లాలన్న నిబంధన ఉన్నా జరుగుమల్లి నుంచి 30 కిలోమీటర్ల దూరం ఉన్న ఒంగోలుకు వందలాది ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. మైనింగ్, పోలీసు అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నారు. ఈ అక్రమ రవాణాపై అధికారులకు సవాల్ విసురుతున్నా. రీచ్‌ల వద్దకు వెళదాం. అక్రమ దందాను నిరూపిస్తాం. అక్రమార్కులపై చర్యలు తీసుకునే దమ్ముందా..? ఆ ప్రాంతంలో పహారా పెడతారా... ప్రభుత్వ ఖనిజాలు దోచుకుపోతుంటే చూస్తూ ఊరుకుంటారా. అక్రమ ఇసుక మైనింగ్ జరుగుతోంది. ప్రభుత్వ ధనం లూటీ అవుతోంది. గతంలో ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో ఆదాయం వచ్చేది. ఖనిజ సంపదకు జవాబుదారీగా ప్రభుత్వం ఉండేది. ప్రభుత్వం తప్పులు సరిదిద్దుకోకపోతే రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదు.

– డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి



పొన్నలూరు మండలం వేంపాడు వద్ద ఇసుకను ట్రాక్టరుకు లోడింగ్ చేస్తున్న జేసీబీ



ఇసుక లోడుతో ఒంగోలు వెళ్తున్న ట్రాక్టర్



మన్నేరు గర్భంలో ఇసుక తవ్వకాలు

వీరయ్య కేసులో పుకార్లు షికార్లు

- పాత్రధారులంతా నెల్లూరు వాళ్లేనని ప్రచారం
- హత్య జరిగి రెండు వారాలు కావస్తున్నా దొరకని నిందితులు
- ఇప్పటికే పోలీసుల అదుపులో ప్రధాన అనుమానితుడు

ఒంగోలు టౌన్: తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య జరిగి రెండు వారాలు కావస్తోంది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఈ హత్య కేసు ఇప్పటికీ విచారణ దశలోనే ఉండడంతో రోజుకో రకంగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. వీరయ్య హత్యలో ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా టీడీపీ నాయకులే కావడంతో కేసు విచారణ విషయంలో పోలీసులు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే హత్య విచారణ ఆలస్యమవుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇప్పటి వరకు వీరయ్య కేసులో ప్రధాన అనుమానితులను చాలా మందినే పోలీసులు విచారించారు. ఇంకా విచారిస్తూనే ఉన్నారు. అయినా ఇంకా కొలిక్కిరాలేదని చెబుతున్నారు.

ఆ నలుగురూ నెల్లూరు వాళ్లేనా...

ఏప్రిల్ 22వ తేదీన ఒంగోలులోని జాతీయ రహదారికి అనుకొని ఉన్న కార్యాలయంలో ఉన్న వీరయ్య చౌదరిని నలుగురు యువకులు కిరాతకంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఎస్పీ కార్యాలయం, తాలూకా పోలీసు స్టేషన్లకు కూత వేటు దూరంలో ఈ హత్య జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది. హత్య తరువాత ఒక స్కూటీ మీద ఇద్దరు, మరో మోటారు బైకు మీద మరో ఇద్దరు నిందితులు పారిపోవడం సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఆ నలుగురిలో ఇద్దరు మాత్రం చీమకుర్తి సమీపంలో ఒక దాబా పక్కన స్కూటీని నిలిపివేసి కనిగిరి ఆర్టీసీ బస్సెక్కి పొదిలి వైపు వెళ్లినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. మిగిలిన నిందితులు ఎటు వైపు వెళ్లారన్నది నిర్ధారణ కాలేదు.



వీరయ్య చౌదరి (ఫైల్)

అయితే ఇప్పటి వరకు ఒంగోలు నగర శివారులోని కొప్పోలులో ఒక ప్రైవేటు పాఠశాల సమీపంలో నివశించే వ్యక్తి నేరుగా హత్యలో పాల్గొన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే అది ఎంత వరకు నిజమో పోలీసులు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. అసలు హత్యలో పాల్గొన్న నలుగురు కూడా నెల్లూరుకు చెందిన పాత నేరస్తులేనన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైతే నెల్లూరు నుంచి ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకొచ్చినట్లు తెలుస్తోంది. మిగతా ఇద్దరి కోసం పోలీసులు విశాఖపట్నం, నెల్లూరు జిల్లాలోని పలు పట్టణాల్లో గాలిస్తున్నట్లు సమాచారం. తిరుపతి జిల్లా తడ పరిసరాల్లో కూడా నిందితుడి కోసం అన్వేషణ కొనసాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కొప్పోలు అనుమానితుడిపైనే ప్రధాన దృష్టి

అయితే వీరయ్య చౌదరి హత్య జరిగినప్పటి నుంచి కొప్పోలుకు చెందిన వ్యక్తి మీదే పోలీసులు ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ హత్య కేసులో అతడు స్వయంగా పాల్గొనడమే కాకుండా మిగతా నిందితులను కూడా అతడే సమకూర్చినట్లు ప్రచారం జరుగుతోంది. హత్యకు ముందు నిందితులు నగరంలోని గుంటూరు రోడ్డులో ఒక లాడ్జీలో ఉన్నారని, వారికి కొప్పోలు వ్యక్తే భోజనాలను పంపించేవాడని సమాచారం. ఈ నేపథ్యంలోనే పోలీసులు అతడి కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. హత్య జరిగిన తరువాత వైజాగ్ పారిపోయినట్లు చెబుతున్నప్పటికీ ఇప్పటి వరకు అతడు వైజాగ్‌లోనే తలదాచుకునే ఉన్నాడో లేక ఎక్కడికైనా జారుకున్నాడో తెలియదు. అతడు దొరికితే కీలకమైన వ్యక్తులు దొరికే అవకాశం ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

మహిళా హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ ప్రారంభం



ఆటల పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



హ్యాండ్ బాల్ టీం సభ్యులు

మార్కాపురం: 54వ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక కమలా సీబీఎస్‌సీ స్కూల్‌గ్రౌండ్స్‌లో చైర్మన్ పవన్, లయన్స్ క్లబ్ చైర్మన్ రామకృష్ణలు చాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వలన మానసిక, శారీరక దృఢత్వంతోపాటు పోటీతత్వం అలవడుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామాంజనేయులు, జిల్లా హ్యాండ్‌బాల్ సెక్రటరీలు రవికుమార్, శ్రీకాంత్, గణేష్, లక్ష్మణ్, మహబూబ్‌బాషా, ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి చంద్రశేఖరరావు, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

నేడు 5 కేంద్రాల్లో నీట్

- నీట్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్
- మధ్యాహ్నం 2 గంటల నుంచి పరీక్ష ప్రారంభం



నీట్ పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర అధికారులు

ఒంగోలు సబర్బన్: నీట్ పరీక్షలు ఆదివారం జిల్లాలోని ఐదు కేంద్రాల్లో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా చెప్పారు. ఈ సందర్భంగా నీట్ పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాలను కలెక్టర్, ఇతర విభాగాల అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ పరీక్షకు మొత్తం 1,473 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఒంగోలు నగరంలోని కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ, దామచర్ల సక్కుబాయమ్మ మహిళా డిగ్రీ కాలేజి, దామచర్ల ఆంజనేయులు పాలిటెక్నిక్ కాలేజి, డీఆర్ఆర్ఎం మున్సిపల్ స్కూల్‌లను కేంద్రాలుగా ఎన్‌టీఏ ఎంపిక చేసిందన్నారు. ఈ 5 కేంద్రాల్లో పరీక్షలు సజావుగా జరిగేందుకు భద్రతా పరమైన చర్యలతో పాటు అభ్యర్థులకు అవసరమైన రవాణా సౌకర్యం, పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్య శిబిరాలు, విద్యుత్ అంతరాయం లేకుండా చూడటం, పారిశుధ్యం, దివ్యాంగులకు వీల్ చైర్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. భద్రత, ప్రశ్నపత్రాల ఓపెనింగ్, అభ్యర్థుల తనిఖీలు, తదితర విషయాల్లో ఎన్‌టీఏ మార్గదర్శకాలను ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఇన్విజిలేటర్లకు అవసరమైన శిక్షణ గురువారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పరీక్షల సిటీ కో ఆర్డినేటర్‌కు ఆమె సూచించారు. అభ్యర్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసే వాతావరణాన్ని కల్పించే బాధ్యత ఆయా సెంటర్ల సూపరింటెండెంట్లపై ఉందన్నారు. పరీక్ష కేంద్రాల పరిశీలనలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ బి.చిన ఓబులేసు, ఇతర అధికారులు ఉన్నారు.

హెచ్‌ఎం పదోన్నతుల్లో అవకతవకలు సవరించాలి

ఒంగోలు సిటీ: స్కూల్ అసిస్టెంట్ నుంచి హెడ్మాస్టర్ పదోన్నతుల జాబితాలో అవకతవకలు సవరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈఓ కిరణ్‌కుమార్‌ను కోరారు. స్థానిక ఎస్‌ఎస్‌ఏ కార్యాలయంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల నాయకులతో శనివారం డీఈఓ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా, జీవో నంబర్ 117 తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ స్కూల్ సిస్టెంట్ నుంచి హెచ్‌ఎంల పదోన్నతుల గురించి చర్చించారు. ఉర్దూ మైనర్ మీడియం సెక్షన్ కొనసాగించాలని, ఉర్దూ ఎస్జీటీ పోస్టును ఉంచాలని కోరారు. మార్కాపురం మున్సిపాలిటీ స్కూల్ అసిస్టెంట్ సోషల్ సీనియార్టీ లిస్టులో లోపాలను డీఈవో దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ఇటీవల మెడికల్ సర్టిఫికెట్ల జారీకి రిమ్స్‌లో ఏర్పాటు చేసిన మూడు రోజుల శిబిరానికి హాజరుకాలేని వారికి మరో సారి అవకాశం కల్పించాల్సిందిగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. కమిషనర్ నుంచి ప్రొసీడింగ్ వచ్చిన వెంటనే అవకాశం కల్పిస్తామని డీఈఓ చెప్పారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై, లక్ష్మీనారాయణ, ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జనార్దన్ రెడ్డి, శ్రీనివాసులు, పీవీ.సుబ్బారావు, పీఆర్‌టీయూ నాయకులు శ్రీనివాసరావు, ఎస్టీయూ నాయకులు చల్లా శ్రీను, నరసింహారెడ్డి, టీఎన్‌యూఎస్ నాయకులు ఆంజనేయులు, పండిత పరిషత్ నాయకులు రఘు, ఎస్ఏపీ నుంచి రఫీ, బీటీఏ నాయకులు వెంకట్రావు, మల్లికార్జునరావు, దిలీప్ చక్రవర్తి, ఏడీ లు వరప్రసాద్, ఉదయ భాస్కర్, సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ రెడ్డి, రమణయ్య, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ఏ లో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న డీఈఓ కిరణ్‌కుమార్

క్లుప్తంగా


రేపటి నుంచి చిల్డ్రన్ సమ్మర్ క్యాంపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బాలోత్సవ కమిటీ నాయకులు

ఒంగోలు టౌన్: ప్రకాశం బాలోత్సవం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి చిల్డ్రన్ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ కమిటీ నాయకులు సీహెచ్ వినోద్, వీరాస్వామి తెలిపారు. శనివారం ఎల్బీజీ భవనంలో క్యాంపు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ మూడేళ్లుగా ఏటా క్రమం తప్పకుండా వేసవి తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో చిన్నారులు టీవీలు, మొబైల్ ఫోన్లకు అతుక్కొనిపోయి విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా చేయాలన్న ఉద్దేశంతోనే సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడం, వారిలోని నైపుణ్యాల ఆధారంగా మరింతగా రాణించేందుకు తోడ్పాటు ఇస్తున్నట్లు చెప్పారు. సైన్స్ ప్రయోగాలు, మెమరీ గేమ్స్, మ్యాజిక్, పాటలు ఆటలు, కథలు నేర్పించడం, మహనీయుల జీవిత చరిత్రలను పరిచయం చేయనున్నట్లు చెప్పారు. 4 నుంచి 10వ తరగతి లోపు విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం 94903 00412 ఫోన్ చేయాలని కోరారు. ప్రజా నాట్యమండలి నగర కార్యదర్శి ఇంద్రజ్యోతి, మ్యాజిక్ రామన్, జన విజ్ఞాన వేదిక నగర కార్యదర్శి రంగారెడ్డి పాల్గొన్నారు.

పింఛన్లకూ బ్రేకులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు పది నెలలు దాటుతున్నా నేటికీ ఒక్క సంక్షేమ పథకం కూడా సమర్థంగా అమలు చేస్తున్న దాఖలాలు లేవు. చివరకు ఏ దిక్కూ లేని వృద్ధులు, వితంతువులకు కూడా పింఛన్లు మంజూరు చేసేందుకు వెనకంజ వేస్తోంది. జిల్లాలో పింఛన్లకు వేలాది మంది అర్హులు ఉన్నా వారికి నిరాశే ఎదురవుతోంది. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే మాత్రమే భార్యకు బదిలీ చేస్తున్నారు. పింఛన్ రాని వ్యక్తి చనిపోతే ఆయన భార్యకు మొండిచెయ్యి చూపుతున్నారు.

- వితంతువులకు తప్పని ఎదురుచూపులు
- పింఛన్ పొందుతూ భర్త చనిపోతే భార్యకు బదిలీ
- పింఛన్ రాని వ్యక్తి చనిపోతే భార్యకు మంజూరు కాని పింఛన్
- కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేదంటున్న అధికారులు
- జిల్లా వ్యాప్తంగా పింఛన్ల కోసం వేలాది మంది ఎదురుచూపులు

కంభం: పింఛన్ డబ్బులు పెంచామని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా కొత్తగా ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయక పోవడంపై ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో అధిక శాతం మంది పేద, మధ్య తరగతి వారున్నారు. వృద్ధులు, దివ్యాంగులతో పాటు వితంతువులు కూడా పింఛన్లు మంజూరు చేయక పోవడంతో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది అవస్థలు పడుతున్నారు. తాజాగా స్పౌజ్ కేటగిరిలో పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏదైనా పింఛన్ పొందుతూ భర్త మృతి చెందిన మహిళలకు మాత్రమే ఈ కేటగిరిలో పింఛన్లు మంజూరు చేస్తారు. వివిధ కేటగిరిల్లో పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వారికి నిరాశే మిగులుతోంది.

పింఛన్ల కోసం ఎదురుచూపులు

కూటమి పాలనలో కొత్త పింఛన్లకు సంబంధించి ఎటువంటి దరఖాస్తులు స్వీకరించలేదు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య సామాజిక పింఛన్‌దారు మరణిస్తే వారి భార్యలను స్పౌజ్ కేటగిరిలో పింఛన్ మంజూరుకు అర్హులుగా నిర్ధారిస్తున్నారు. దీంతో ఎటువంటి పింఛన్ పొందని వ్యక్తి మరణించినా ఆ కుటుంబంలో అర్హులకు నిరాశ ఎదురవుతోంది. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది వితంతువులు పింఛన్ పొందేందుకు అర్హులుగా ఉన్నారు. పింఛన్ల సంఖ్య పెంచకుండా ప్రభుత్వం సర్దుబాటు చేస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

పింఛన్ల మంజూరులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనుసరించిన విధానమే సరైందని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. పింఛన్ బదలాయింపు వంటివి లేకుండా సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించారు. భర్త చనిపోయిన వారికి వితంతు పింఛన్లు మరుసటి నెలలోనే మంజూరు చేసేలా చర్యలు తీసుకునే వారు. అదే విధంగా ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్ల మంజూరుకు అవకాశం కల్పించే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేక పోవడంతో అర్హులు ఇబ్బందులు పడుతున్నారు.

“ కొత్తగా దరఖాస్తుకు అవకాశం లేదు

2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య సామాజిక పింఛన్‌దారు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ కేటగిరిలో పింఛన్ మంజూరు చేసేందుకు వెరిఫికేషన్ చేస్తున్నాం. కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతానికి అవకాశం లేదు. సర్వర్ ఓపెన్ అయితే అర్హులైన వారు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

– వీరభద్రాచారి, ఎంపీడీఓ, కంభం

“ పింఛన్ మంజూరు చేయాలి



నా భర్త 2023 నవంబర్ 09వ తేదీన చనిపోయాడు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయం వద్దకు వెళ్తే 2023 డిసెంబర్ 1వ తేదీ తర్వాత చనిపోయిన వారికి మాత్రమే పింఛన్ ఇస్తున్నట్లు చెబుతున్నారు. వారు చెప్పిన తేదీకి 21 రోజుల ముందు నా భర్త చనిపోయాడు. పింఛన్ డబ్బులు వస్తే నాకు మందులకు, ఇతర ఖర్చులకు ఉపయోగపడతాయి.

– రావిపాటి కృష్ణమ్మ, యర్రబాలెం, కంభం మండలం

“ కొద్ది రోజుల క్రితం నా భర్త చనిపోయాడు



నా భర్త కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. కూలి పనులకు వెళ్లి వచ్చిన డబ్బుతో జీవిస్తున్నా. ఇటువంటి సమయంలో పింఛన్ డబ్బులన్నా వస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. అధికారులను అడిగితే పింఛన్ పెట్టుకోవడానికి ఇంకా అవకాశం ఇవ్వలేదంటున్నారు.

– గంగుల పిచ్చమ్మ, అంకభూపాలెం

“ దరఖాస్తుకు అవకాశం ఇవ్వాలి



నా భర్త 2024 డిసెంబర్ 27వ తేదీన చనిపోయాడు. నేను కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. భర్త చనిపోయి జీవనోపాధి కోల్పోయిన నాకు వితంతు పింఛను కూడా రావడం లేదు. ప్రభుత్వం స్పందించి పింఛన్ మంజూరు చేయాలి.

– పత్రా మార్తమ్మ, పాపినేనిపల్లి

చిన్నారులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవాలి

ఒంగోలు టౌన్: చిన్నారులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకునేలా ప్రోత్సహించాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి సూచించారు. జిల్లా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు శనివారం 5వ రోజుకు చేరాయి. 65 మంది చిన్నారులు హాజరుకాగా వారితో కథలు చదివించారు. ఇంగ్లిష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్, లూసిడా హ్యాండ్ రైటింగ్, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి తరగతులను సందర్శించారు. క్రాఫ్ట్ క్లాసులో పిల్లలు తయారు చేసిన వస్తువులు చూసి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతులతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. సెల్‌ఫోన్లు, ఆన్‌లైన్ గేమ్‌లతో చిన్నారుల విలువైన సమయం పాడు కాకుండా మంచి అలవాట్లతో చిన్నారులను తీర్చిదిద్దొచ్చన్నారు. వేసవి విజ్ఞాన తరగతులకు హాజరయ్యేలా చిన్నారులను ప్రోత్సహించాలని తలిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా గ్రంథాలయ ఉపపాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ చిన్నారులకు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా చేస్తే వారిలోని ఆలోచనలను మేలుకొల్పొవచ్చని చెప్పారు. చిన్నతనం నుంచే వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దితే పెద్దయ్యాక బాధ్యత కలిగిన పౌరులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. శిరీష, టి.రవీంద్ర, డి.ప్రసాద్, ఆర్.విందుమణి, టి.శ్రీనివాసరావు, వెంకయ్య పాల్గొన్నారు.



వేసవి విజ్ఞాన తరగతులకు హాజరైన చిన్నారులు

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి



ఐశ్వర్యను తల్లిదండ్రులకు ఎస్పీ సమక్షంలో అప్పగిస్తున్న సీఐ, ఎస్సై

- కేసును రెండు రోజుల్లో ఛేదించిన పోలీసులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఐశ్వర్య తల్లిదండ్రులు
- సింగరాయకొండ సీఐ, ఎస్సైను అభినందించిన ఎస్పీ

సింగరాయకొండ: సార్.. మా బిడ్డ ఐశ్వర్య (3) కనబడటం లేదు.. రక్షించి మాకు అప్పగించడండి.. అంటూ తండ్రి చిలకూరి హరికృష్ణ ఫిర్యాదుతో వెంటనే రంగంలోకి దిగి రెండు రోజుల్లో కేసును ఛేదించిన సీఐ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్రలను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 30వ తేదీ బుధవారం నుంచి కుమార్తె ఐశ్వర్య కనబడటం లేదని పాతసింగరాయకొండ పంచాయతీ బాలిరెడ్డినగర్‌కు చెందిన హరికృష్ణ ఈ నెల ఒకటో తేదీన ఎస్సై బి.మహేంద్రకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలతో సీఐ హజరత్తయ్య సూచనలతో దర్యాప్తు ప్రారంభించిన ఎస్సై మహేంద్ర పాప తప్పిపోయిన రైల్వేస్టేషన్ రోడ్డులోని సీసీ కెమెరాలను జల్లెడ పట్టారు. సీసీ కెమెరాలతో నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం ఎర్రారెడ్డిపాలేనికి చెందిన యువకుడు నరసింహం పాపను రైల్వేస్టేషన్ నుంచి పోలీస్‌స్టేషన్ సెంటర్‌కు వచ్చి కందుకూరు వైపు వెళ్లే బస్సు ఎక్కడాన్ని గుర్తించారు. వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలో ప్రచారంతో పాటు కరపత్రికలు కందుకూరు, వలేటివారిపాలెం తదితర ప్రాంతాల్లో పోలీసులు పంపిణీ చేశారు. ఈ ప్రయత్నంలో చివరికి నెల్లూరు జిల్లా వలేటివారిపాలెంలో ఉన్నట్లు సమాచారం అందటంతో అక్కడికి వెళ్లి పాపను స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. యువకుడు నరసింహను పట్టుకున్న ఎస్సై మహేంద్ర వివరాలు రాబట్టగా రైల్వేస్టేషన్ వద్ద ఐశ్వర్య నాయనమ్మ మద్యం తాగి పడిపోయిందని, దీంతో తనకు దిక్కుతోచక పాపను తీసుకెళ్లానే తప్ప వేరే ఉద్దేశం లేదని చెప్పాడన్నారు. ఐశ్వర్యను తమకు అప్పగించిన ఎస్సై మహేంద్రను తల్లి శిరీష అభినందించారు. పాప తప్పిపోవడంతో రెండు రోజులుగా నిద్రాహారాలు లేకుండా రోదించానని, ఏం చేయాలో అర్థం కాలేదని, చివరికి దేవుల్లా మా అమ్మాయిని మా ఒడికి చేర్చారని ఆమె కన్నీటి పర్యంతమైంది. కేసును పట్టుదలతో ఛేదించిన ఎస్సై మహేంద్రను మండల ప్రజలు అభినందించారు.

డ్రోన్ కెమెరాలతో నేరాల నియంత్రణ



డ్రోన్ అందుకుంటున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: నేరాల నియంత్రణలో డ్రోన్ కెమెరాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, నేర స్థలాలను పరిశీలించేందుకు, ట్రాఫిక్‌ను పర్యవేక్షించేందుకు వీలవుతుందని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు కళాశాల యజమాని రవికుమార్ శనివారం పోలీసు శాఖకు డ్రోన్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని పోలీసుస్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాలు, ఇతరా నేరాలకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలను ముందుగానే గుర్తించి అక్కడకు డ్రోన్లను పంపించినట్లు తెలిపారు. ప్రముఖుల బందోబస్తుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. డ్రోన్ కెమెరాలు పోలీసుల సామర్థ్యాన్ని మరింత మెరుగు పరుస్తుందన్నారు. రూరల్ సీఐ శ్రీకాంత్, మద్దిపాడు ఎస్ఐ శివరామయ్య పాల్గొన్నారు.

లక్ష్మీచెన్నకేశవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న చెన్నకేశవస్వామి



పూజలందుకుంటున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి

మార్కాపురం టౌన్: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి, కంభంరోడ్డులోని ప్రసన్న వేంకటేశ్వరస్వామికి అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్లకు అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు చేశారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈవో జీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేడు సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

- ప్రారంభోత్సవానికి హాజరు కానున్న హైకోర్టు జడ్జిలు
- ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన జిల్లా జడ్జి భారతి



ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న సివిల్ జడ్జి కోర్టు

సింగరాయకొండ: కొండపి నియోజకవర్గ ప్రజల కల అయిన సివిల్ జడ్జి (జూనియర్ విభాగం) కోర్టు ఆదివారం ఉదయం 9.30 గంటలకు స్థానికంగా ప్రారంభించనున్నట్లు సింగరాయకొండ బార్ అసోసియేషన్ తెలిపింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు జడ్జి, ప్రకాశం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి టి.రాజశేఖరరావు, హైకోర్టు జడ్జిలు డాక్టర్ కె.మన్మథరావు, జి.రామకృష్ణ ప్రసాద్, డాక్టర్ వై.లక్ష్మణరావు, జిల్లా జడ్జి భారతి, జిల్లాలోని అన్ని కోర్టుల జడ్జిలు పాల్గొంటారన్నారు. కోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లను శనివారం జిల్లా జడ్జి భారతి స్వయంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి దుర్మరణం

గిద్దలూరు రూరల్: రైలు నుంచి గుర్తుతెలియని వ్యక్తి జారి పడి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని కె.ఎస్.పల్లె సమీపం రైల్వేబ్రిడ్జి వద్ద శనివారం వెలుగులోకి వచ్చింది. నంద్యాల జీఆర్‌పీఎఫ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడటంతో దుర్మరణం చెందాడు. ముఖం గుర్తుపట్టేందుకు వీల్లేకుండా ఛిద్రమైంది. మృతుడు నారింజ రంగు చొక్కా, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలూ లభించలేదని పోలీసులు తెలిపారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన బాలికల జట్టు..



బాలుర జట్టు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల బాస్కెట్ బాల్ జట్ల ఎంపికలు శనివారం కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 30 మంది బాలురు, 30 మంది బాలికలు హాజరయ్యారు. వీరిలో నైపుణ్యం కనబరిచిన 12 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశారు. ఈ జట్లకు పామూరులోని సెయింట్ మార్క్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు శిక్షణ శిబిరం ఉంటుందన్నారు. 15 నుంచి 18వ తేదీ వరకు చిత్తూరులో జరిగే సబ్ జూనియర్స్ రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు. ఎంపికలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి టి.సుబ్బారావు, కోశాధికారి ముప్పారపు జయకుమార్, మెంబర్ సయ్యద్ జిలానీబాషా, పలువురు పీడీలు పాల్గొన్నారు.

35 టన్నుల తెల్లరాయి పట్టివేత

- లారీ స్వాధీనం, పోలీసుస్టేషన్‌కు తరలింపు



పట్టుబడిన తెల్లరాయి

కొనకనమిట్ల: కనిగిరి నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 35 టన్నుల తెల్లరాయి లారీని శనివారం రాత్రి భూగర్భ గనుల ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. మార్కాపురం భూగర్భ గనుల ఖనిజాభివృద్ధి సంస్థ డివిజన్ కార్యాలయం ఏజీ పోలిరెడ్డికి అందిన సమాచారం మేరకు ఆయన తన సిబ్బందితో వెళ్లి అక్రమంగా తరలిస్తున్న తెల్లరాయి లోడు లారీని పట్టుకున్నారు. ఏజీ తెలిపిన వివరాల మేరకు కనిగిరి నుంచి హైదరాబాద్‌కు తెల్లరాయితో వెళ్తున్న లారీని కొనకనమిట్ల మండలం చినారికట్ల జంక్షన్ సమీపంలో తనిఖీ చేసి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు తెల్లరాయి లారీని స్వాధీనం చేసుకొని కొనకనమిట్ల పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన రాయి, లారీ విషయంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని పోలిరెడ్డి స్పష్టం చేశారు. టీఏ బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



వలి మృతదేహం

కంభం: మద్యం తాగి ఉన్న ఓ వ్యక్తి ఇంట్లో నిద్రిస్తూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి స్థానిక కాప వీధిలో జరిగింది. వివరాలు.. అర్ధవీడుకు చెందిన షేక్ వలి (45) కంభం పంచాయతీ పరిధి సాధుమియా వీధిలో వివాహం చేసుకొని భార్యతో కలిసి కొంతకాలంగా కాప వీధిలో నివాసం ఉంటున్నాడు. పెయింటింగ్, ఇతర కూలి పనులకు వెళ్లే వలి మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవపడే వాడని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం తర్వాత ఇంటికి వచ్చిన అతను నిద్రపోయాడని, చీకటి పడుతున్నా లేవక పోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మద్యం తాగిన అతను డీహైడ్రేషన్‌తో మృతి చెందాడా? ఇంకా ఏదైనా కారణంతో మృతి చెందాడా అన్న వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.